

తిరుపతి జిల్లాకు నేటితో మూడేళ్లు
ఇంకా అద్దె నీడలోనే..

తిరుపతి జిల్లా ఏర్పడి నేటితో మూడేళ్ళు పూర్తయింది. అశాస్త్రీయంగా జరిగిన విభజనతో కాలూచెయ్యీ కూడదీసుకోవడానికే కొత్తజిల్లా సతమతం అవుతోంది. జిల్లా కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తిరుమల శ్రీవేంకటేశ్వరుడూ, విశాలమైన సముద్ర తీరం, శ్రీసిటీ పారిశ్రామిక సముదాయం ఉండబట్టి సరిపోయింది కానీ లేకపోతే తిరుపతి జిల్లా ఈపాటికి కుదేలై కుప్పకూలి ఉండేది. సమర్థులైన అధికారుల సారధ్యంలో ప్రగతి దిశగా పరుగులందుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రజాప్రతినిధుల తోడ్పాటు జతకలిస్తేనే ఈ పరుగు వేగం అందుకుంటుంది.
- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మూడు జిల్లాల్లోకి చెల్లాచెదురు

పార్లమెంటు నియోజకవర్గం ప్రాతిపదికన కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినా, తిరుపతి జిల్లాలో దానిని పాటించలేదు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు మాత్రమే పూర్తిగా తిరుపతి జిల్లాలో వున్నాయి. వెంకటగిరి సెగ్మెంట్‌లో మూడు మండలాలు తిరుపతి జిల్లాలో, మూడు మండలాలు నెల్లూరు జిల్లాలో కలిపారు. సర్వేపల్లి సెగ్మెంట్ పూర్తిగా నెల్లూరు జిల్లాలో వుంది. అంటే పార్లమెంటు నియోజకవర్గం మూడు రకాలుగా రెండు జిల్లాల నడుమ చెల్లాచెదురైంది. మరోవైపు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని చంద్రగిరి సెగ్మెంట్ పూర్తిగా తిరుపతి జిల్లాలో వుండగా అదే పార్లమెంటు పరిధిలోని నగరి సెగ్మెంటుకు సంబంధించి మూడు మండలాలు చిత్తూరు జిల్లాలో, రెండు మండలాలు తిరుపతి జిల్లాలో కలిపారు. దీనివల్ల పాలనా పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధి, సమస్యలపై రెండు జిల్లాల అధికార యంత్రాంగాలతో ఎంపీలు సంప్రదించాల్సి వస్తోంది. అలాగే వెంకటగిరి, నగరి ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యల గురించి రెండు జిల్లాల అధికారులను కలవాల్సి వస్తోంది. ఎన్నికల నిర్వహణ సైతం ఇబ్బందిగా మారుతోంది. మూడేళ్ళవుతున్నా ఈ అశాస్త్రీయ విభజనను సరిదిద్దనే లేదు.

కంగాళీగా రెవెన్యూ డివిజన్లు

వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వుండగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లా గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, పుత్తూరు మండలాలు తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో వుండగా నగరి, నిండ్ర, విజయపురం మండలాలు చిత్తూరు జిల్లాలోని నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ తదితర మూడు మండలాలు సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో వుండగా పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం, నారాయణవనం శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. దీనివల్ల వెంకటగిరి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలకు సైతం ఆర్డీవోలను కలవడం సమస్యగా మారుతోంది.

విభజన కాని శాఖలు, సంస్థలు

కొత్త జిల్లాల ఏర్పాటు జరిగాక కూడా కొన్ని శాఖలు, పాలకమండళ్ళతో కూడిన సంస్థలు విభజితం కాలేదు. ఉదాహరణకు తిరుపతి జిల్లాలోని సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి కోర్టులు చిత్తూరు జిల్లా జడ్జి నియంత్రణలో వుండగా సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి కోర్టులు నెల్లూరు జిల్లా జడ్జి పర్యవేక్షణ కింద వున్నాయి. మైనారిటీ సంక్షేమ శాఖ,వక్ఫ్ బోర్డు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటివి జిల్లాల నడుమ విభజన కాలేదు. ఇక జిల్లా పరిషత్తు అనేది పంచాయతీ రాజ్ శాఖలో గ్రామీణాభివృద్ధి పరంగా కీలక పాత్ర పోషిస్తుంది. జడ్పీ విభజన జరగకపోవడంతో తిరుపతి జిల్లాలోని 34 మండలాలకు గానూ 20 మండలాలపై చిత్తూరు జడ్పీ నియంత్రణ, పర్యవేక్షణ కొనసాగుతుండగా మిగిలిన 14 మండలాలపై నెల్లూరు జడ్పీ అజమాయిషీ నడుస్తోంది. చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 20 మండలాలు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 14 మండలాలు వున్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల కార్యకలాపాలు కూడా చిత్తూరు, నెల్లూరు జిల్లాల అజమాయిషీలో వున్నాయి. ఇందువల్ల జిల్లా అధికార యంత్రాంగానికి ఆయా శాఖలు, సంస్థలపై పట్టు, నియంత్రణ లేకుండా పోతోంది.

టీటీడీ భవనంలోనే కలెక్టరేట్



మూడేళ్లయినా తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కే సొంత భవనం లేదు. యాత్రికుల కోసం టీటీడీ నిర్మించిన పద్మావతీ నిలయంలో తాత్కాలికం పేరుతో మొదలైన పాలన అలాగే కొనసాగుతోంది. ఏడంతస్తులు, 200 గదులతో కూడిన పద్మావతీ నిలయంలో 46 శాఖలకు 180 గదులు కేటాయించారు. ఇంకా 20 గదులు ఖాళీగా వున్నాయి. నెలకు రూ. 25,29,755 అద్దె చెల్లించేలా 2022 మార్చి 7 నుంచీ రెండేళ్ళ పాటు లీజుపై ఈ భవనాన్ని కేటాయించారు. రెండేళ్ళ గడువు ముగిశాక 2024 మార్చి 7నుంచీ 2027 మార్చి 6 వరకూ మూడేళ్ళ పాటు లీజు పొడిగించారు. నెలవారీ అద్దె రూ. 26,05,647గా నిర్ణయించారు. ఇప్పటిదాకా ఈ భవనానికి అద్దెకింద ప్రభుత్వం టీటీడీకి రూ.9,19,81,884లు చెల్లించాల్సి వుండగా, ఇప్పటిదాక రూ. 5,62,47,187లు చెల్లించారు. రూ. 3,57,34,697 బకాయి ఉన్నారు. ఇక నెలకు విద్యుత్‌కే రూ.9లక్షలు ఖర్చవుతోంది. భవన సముదాయంలో పారిశుధ్యం, సెక్యూరిటీ వంటివి టీటీడీయే చేపడుతోంది. మూడేళ్ళు అయినా ప్రభుత్వం కలెక్టరేట్‌కు సొంత భవనం కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. కనీసం స్థల సేకరణ కూడా జరగలేదు. ఏడాదికి 3 కోట్లకు పైగా అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వం అదే నిధులతో నిర్మాణం చేపడితే అద్దె భారం తగ్గుతుందని పలువురు సూచిస్తున్నారు.

ఎస్పీ ఆఫీసుకు మాత్రమే సొంత నీడ

తిరుపతి జిల్లా ఏర్పాటు కాక మునుపే తిరుపతి కేంద్రంగా అర్బన్ పోలీసు జిల్లా ఏర్పాటైనందున ఎస్పీ కార్యాలయానికి మాత్రమే శాశ్వత భవన వసతి అందుబాటులో వుంది. మిగిలిన ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలకు సొంత భవనాలు లేవు.





శ్రీకాళహస్తిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నడుస్తున్న ఆర్డీవో కార్యాలయం - సూళ్ళూరుపేట రైతు సేవా సహకార కేంద్రం గోదాములో నడుస్తున్న ఆర్డీవో కార్యాలయం

సర్దుకుని నడుస్తున్న ఆర్డీవో ఆఫీసులు

తిరుపతి జిల్లా ఏర్పాటయ్యాక కొత్తగా శ్రీకాళహస్తి రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. దీనికి సొంత భవనం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలోనే నడుస్తోంది. అలాగే నాయుడుపేట కేంద్రంగా మునుపటి నుంచీ వున్న రెవిన్యూ డివిజన్ కేంద్రాన్ని గత వైసీపీ ప్రభుత్వం సూళ్ళూరుపేటకు మార్చింది. అక్కడా ఆర్డీవో కార్యాలయానికి సొంత భవనం లేదు. రైతు సేవా సహకార సంఘం ఆవరణలో గోదాము కోసం నిర్మించిన భవనంలో నడుస్తోంది.



సర్పదోష నివారణ పూజలు చేయించుకుంటున్న పూజా హెగ్డే

ముక్కంటి సేవలో నటి పూజాహెగ్డే

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీ నటి పూజాహెగ్డే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమె ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆమెను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారులు హరియాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీపై కదలిక

నేడు స్పెషల్ డ్రైవ్

తిరుపతి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెట్ రైట్ (టీడీఆర్) బాండ్ల జారీపై కదలిక వచ్చింది. బాండ్ల జారీకోసం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం ఆస్తులు పోగొట్టుకున్న చిన్నాచితకా యజమానులకు ఊరట కలగనుంది. గత వైసీపీ పాలనలో టీడీఆర్ బాండ్ల జారీలో పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో లావాదేవీలకు నోచుకోని టీడీఆర్ బాండ్లు చెల్లవని ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదించిన 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1,121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. గొల్లవానిగుంట, కొర్లగుంట ప్రాంతాల్లో స్వల్పంగా భూములు కోల్పోయిన వారితో పాటు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొందరికి పెద్దమొత్తంలో బాండ్లు జారీ అయ్యాయి. ఇంకా 1,200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. ప్రతి చదరపు గజానికి రూ.35వేలు చొప్పున 2.80 లక్షల చదరపు గజాల స్వాధీనంతో కూడిన 342 టీడీఆర్ బాండ్ల జారీపై వివరాణత్మక నివేదికను సమర్పించాలని, మొత్తం రూ1,013 కోట్లు టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్టు ఉత్తర్వులో పేర్కొంది. అయితే ఉత్తర్వులు వెలువడే నాటికే 75 శాతం టీడీఆర్ బాండ్లు వినియోగం జరిగిపోయిందని, తక్కిన 25 శాతం మాత్రమే ఉన్నాయని కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ బాండ్ల అవినీతిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రెసిడెన్షియల్ స్థలానికి కమర్షియల్ విలువ కట్టి అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లు కట్టబెట్టడం ద్వారా కార్పొరేషన్‌కు దాదాపు రూ.150కోట్లు నష్టం వాటిల్లినట్టు విజిలెన్స్ విభాగం ప్రాథమికంగా తేల్చింది. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయమని ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. డాక్యుమెంట్లను పరిశీలించిన కమిటీ లబ్ధిదారులకు బాండ్లను జారీ చేస్తోంది.

స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోండి

టీడీఆర్ బాండ్ల జారీ కోసం శుక్రవారం ఉదయం పది గంటల నుంచి తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొంటారన్నారు. వాలిడేషన్ చేయించుకునేవారు ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని తెలిపారు. ఆన్‌లైన్ ఎండార్స్‌మెంట్, షార్ట్ ఫాల్ ఇచ్చినవారు తగిన డాక్యుమెంట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ మూల్యాంకనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి మూల్యాంకనం గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈనెల 9వ తేదీ వరకు 1.85 లక్షల జవాబు పత్రాలను 775 అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేయనున్నారు. మొదటిరోజు 22,775 పత్రాలను మూల్యాంకనం చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉండగా మూల్యాంకన కేంద్రంలో సాయంత్రం 4.30 గంటల సమయంలో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పది నిమిషాల్లో మళ్లీ సరఫరా పునరుద్ధరణ కావడంతో పెద్దగా ఇబ్బంది ఏర్పడలేదు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరామని డీఈవో చెప్పారు.

'ఉచితం' ముసుగులో ఇసుక అక్రమ రవాణా

అరుణా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



సత్యవేడు/పిచ్చాటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): భవన.. ప్రభుత్వ నిర్మాణ పనులకు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెట్టింది. సమీపంలోని నదులు, వాగుల నుంచి తరలించుకునే వీలు కల్పించింది. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు ఉచితం ముసుగులో అక్రమ రవాణాకు తెరలేపారు. ఇలా నాగలాపురం, పిచ్చాటూరు మండలాల సరిహద్దులో అడవి కొడియంబేడు, బైట కొడియంబేడు గ్రామాల పరిధిలోని అరుణా నది నుంచి ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి వేళ ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తోడి సమీప ప్రాంతాల్లో డంప్ చేసి.. ట్రాక్టర్ల ద్వారా రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నాగలాపురం, పిచ్చాటూరు మండలాల మీదుగా ఇసుక తీసుకెళుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా, పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో అరుణానది పరివాహ ప్రాంతాల నుంచి తరలిస్తున్న ఇసుకను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఐదు రోజులుగా ఇసుకను తీసుకెళ్లి మామిడి తోటలో డంప్ చేసి రాత్రి వేళలో టిప్పర్ల ద్వారా తమిళనాడుకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తుండడంతో కొందరు ట్రాక్టర్లను అడ్డుకున్నారు.

7 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలను ఈనెల 7వ తేదీ నుంచి నిలిపివేస్తున్నామని, దయ చేసి తమను అర్థం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) గురువారం ఓ ప్రకటనలో కోరారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధపడుతూనే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.3,500 కోట్లు రావాల్సి ఉందని, తాము మోయలేనంతటి ఆర్థిక భారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

విద్యుత్ అదనపు లోడ్డు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రేణిగుంట సబ్ డివిజన్ డీఈఈ రమేష్ తెలిపారు. జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) 50 శాతం రాయితీ కల్పించిందని వెల్లడించారు. ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో దరఖాస్తులో అంగీకరించిన లోడ్ కంటే ఎక్కువ వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు.

విచ్చలవిడిగా క్వారీ పేలుళ్లు

- నాలుగు గ్రామాల్లో భయానక వాతావరణం
- రాయితగలడంతో తలపగిలి ప్రాణాపాయ స్థితిలో బాలుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

పుత్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన పల్లెలో ఆరుబయట నిద్రించలేరు. పగటి పూట మామిడి తోటల్లో పశువులను మేపుకొనే పరిస్థితి లేదు. ఎందుకంటే.. క్వారీలో ఎప్పుడు పేలుడు సంభవిస్తుందో.. ఏ రాయి వచ్చి తగులుతుందోనన్న ఆందోళన వారిని పట్టి పీడిస్తుంది. ఇలాంటి భయానక పరిస్థితి పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వరాపురం, దళితవాడ, యానాదికాలనీ, బొజ్జనత్తం ప్రజలు ఎదుర్కొంటున్నారు.

ఈశ్వరాపురం మామిడితోటలో కాపలా వున్న రామయ్య మూడేళ్ల కుమారుడు దినేశ్ బుధవారం మధ్యాహ్నం గుడిసె ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో మైనింగ్‌లో జరిపిన బ్లాస్టింగ్ వల్ల ఓ పదునైన రాయి వచ్చి ఆ బాలుడి తలను తాకింది. వెంటనే రక్తం మడుగులో పడిపోయాడు. హుటాహుటిన పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఇంకా పిల్లవాడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఇలాంటి ఉదంతాలు ఎన్నెన్నో.. ఆ నాలుగు గ్రామాల్లో బ్లాస్టింగ్ కుదుపుల వల్ల ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. టీవీలు కింద పడి పగిలిపోతున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని గ్రామస్థులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, సదస్సుల్లో వినతులు ఇచ్చినా ఫలితం శూన్యం. ఈ ఉదంతాన్ని గురువారం పుత్తూరు వచ్చిన కలెక్టర్ దృష్టికి సీపీఎం కార్యదర్శి వెంకటేశ్ నాయకత్వంలో ఆ కాలనీవాసులు తీసుకువచ్చారు. కలెక్టర్ ఆదేశం మేరకు హుటాహుటిన సాయంత్రం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మైనింగ్ నిర్వాహకులను పిలిచి ప్రభుత్వ అనుమతులన్నింటిని శుక్రవారం మధ్యాహ్నం తీసుకురావాలని ఆదేశించారు. మైనింగ్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశానికి మైనింగ్ బాధితులూ రావాలని తహసీల్దార్ కోరారు.



మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించిన తహసీల్దార్, సీపీఎం నేతలు

రాసే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాసే నైపుణ్యాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఎస్వీ యూనివర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. 'అకడమిక్ రైటింగ్స్' అంశంపై ఎస్వీయూ ఇంగ్లిషు విభాగం సెనేట్ హాల్లో చేపట్టిన రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాసే నైపుణ్యంతోనే తమలోని ఆలోచనలను ప్రపంచానికి తెలియజేసే అవకాశం ఉంటుందన్నారు. తమిళనాడులోని దిండిగల్ గాంధీగ్రామ్ రూరల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జోసఫ్ దొరైరాజ్, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ మురళీధర్, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ టి.శారద, ఇంగ్లిషు బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.సుమకిరణ్, అకడమిక్ కన్సల్టెంట్ సునీల్, గెస్ట్ ఫ్యాకల్టీ సింధు, యాస్మిన్ తాజ్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

భాకరాపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో గురువారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మండలానికి మంజూరైన 83 నీటి తొట్టెల నిర్మాణానికి రంగన్నగారిగడ్డలో భూమి పూజ చేశారు. తొగటపల్లెలో వాటర్ ప్లాంట్‌ను, బొబ్బిలినేనివారిపల్లెలో సీసీ రోడ్డు, లంకిపల్లెవారిపల్లెలో సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రూ.8.48 లక్షలు విలువజేసే సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు జనర్దాన్‌రాజు, ఎంపీడీవో గిడ్డయ్య, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, అచిట్టెమ్మ, వైఎస్ ఎంపీపీ సునీత దామోదర్, ఎంపీటీసీ విజయకుమారి, సర్పంచ్ మనోహర తదితరులు పాల్గొన్నారు. ●చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుడు సంద్ర రెడ్డప్ప పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సత్కరించారు. మాజీ ఎంఎల్‌సీ శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

● భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన 64 మంది రైతులకు రూ.10.24 లక్షలకు సంబంధించిన పరిహారం చెక్కులను ఎమ్మెల్యే నాని అందజేశారు.. కార్యక్రమంలో రేంజర్ వెంకటరమణ, రైతు సంఘం నాయకులు రామానాయుడు, పాల్గొన్నారు.



బాధిత రైతులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

మా భూమి కబ్జా చేస్తున్నారు!

●పవన్ కాపాడాలంటూ ఎన్నారై వీడియో

తిరుచానూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో తమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారంటూ ఒక ఎన్నారై పోస్టు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తిరుచానూరులో సర్వే నెంబరు 298/4లో 120 అంకణాల తమ స్థలం కబ్జా చేసేందుకు ఒక వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని ఆస్రేలియాలోని సిడ్నీలో నివాసం ఉన్న ఎన్ఆర్ఐ రాజేంద్రప్రసాద్ ఆ వీడియోలో ఆరోపించారు. ప్రహరీ గోడను కూడా కూల్చివేశారని పేర్కొన్నారు. దీనిపై తమ తమతండ్రి విశ్రాంత ఎక్సైజ్ సూపరిటెండెంట్ అయిన వెంకటరమణ జిల్లా ఎస్పీకి, తిరుచానూరు సీఐకి ఫిర్యాదు చేశారని వివరించారు. అయినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. చివరకు ఏపీఎస్ఆర్‌టీకి ఫిర్యాదు చేస్తే నామమాత్రపు కేసు నమోదు చేశారని వాపోయారు. తాము జనసేనకు ఎన్నికల్లో ప్రచారం చేశామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో బీహార్ తరహా నేరాలు జరుగుతున్నాయంటూ సామాన్యులను కాపాడేది పవన్ కల్యాణ్ ఒక్కడే అన్నారు. ఆయన హోంమినిస్టర్ కావాలన్నారు. కాగా రాజేంద్రప్రసాద్ తండ్రి వెంకటరమణ కూడా కబ్జాదారుల నుంచి పవన్ కల్యాణ్ తమను కాపాడలని కోరుతూ ఇదే అంశంపై మరో వీడియో విడదల చేశారు. తిరుచానూరు సింధు ఫ్లైఓవర్ వద్ద జాతీయరహదారి సమీపంలో బంధువుల నుంచి తాము కొనుగోలు చేసిన ఈ భూమిపై కోర్టు గత నెలలో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ వివరణ కోరగా వెంకటరమణ ఫిర్యాదు ఇచ్చిన వెంటనే కేసు నమోదు చేశామని ఆంధ్రజ్యోతికి తెలిపారు. భూమి పత్రాలు చూపమంటే ఇంతవరకు అతను చూపడంలేదన్నారు.



సోషల్ మీడియా వేదికగాపోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఎన్ఆర్ఐ రాజేంద్రప్రసాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నరసింగాపురం రైల్వే ట్రాక్ పక్కన సుమారు 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు చంద్రగిరి పోలీసులు చేరుకోని మృతదేహాన్ని పరిశీలించారు. తల వెనుక రక్త గాయాన్ని గుర్తించారు. చందనం రంగు షర్టు, నీలంరంగు లుంగీ, కట్టుకోని ఉన్నాడు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వివరాలకు కోసం 9440796760, 6305014261, 0877-2289020 నంబర్లకు సంప్రదించాలన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పికి గాయాలు

పాకాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతం నుంచి జనావాసాల మధ్యకు వచ్చిన చుక్కల దుప్పిని ఊరకుక్కలు దాడిచేసి గాయపరిచాయి. కావలివారిపల్లెలో గురువారం ఉదయం చుక్కల దుప్పిపై కుక్కలు దాడిచేస్తుండగా గ్రామంలోని యువకులు చూశారు. వెంటనే స్పందించి దుప్పిని రక్షించి పశువైద్యులతో వైద్యం చేయించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు దానిని అప్పగించారు.

వైభవంగా గంగమ్మ జాతర

చంద్రగిరి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పుల్లయ్యగారిపల్లెలో బుధవారం రాత్రి గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. 40 ఏళ్ళ తరువాత ఈ వేడుకను నిర్వహించారు. బుధవారం రాత్రి బంక మట్టితో శాంతాడు గంగమ్మ ప్రతిమను తయారు చేసి, విశేషంగా అలంకరించి, తెల్లవారు జామున గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం గ్రామస్తులు, మహిళలు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి, నైవేద్యం సమర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే నాని తనయుడు పులివర్తి వినీల్ వేరు వేరుగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఘనంగా ఎస్వీహైస్కూల్ వార్షికోత్సవం

తిరుమల, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల కొండపై పుట్టి పుట్టి అక్కడే చదువుకోవడం పూర్వజన్మ సుకృతమని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వర హైస్కూల్‌లో గురువారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకయ్య చౌదరి ప్రసంగిస్తూ... విద్యార్థులకు విద్యతో పాటు విలువలు కూడా నేర్పించాల్సిన అవసరముందన్నారు. అవసరమైన మేరకు ఇంటర్నెట్‌ను వినియోగించాలని సూచించారు. దాదాపు 1,500 మందికి సౌకర్యాలు ఉన్న ఈ హైస్కూల్‌లో 500 మంది మాత్రమే ఉన్నారని, సంఖ్య పెంచాలని కోరారు. తిరుమలకు వచ్చే విశిష్ట వ్యక్తులను తీసుకువస్తే విద్యార్థులకు ప్రేరణ కలుగుతుందన్నారు. పోటీ పరీక్షలు, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అదనపు ఈవో మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో విజయలక్ష్మీ, రంగలక్ష్మీ, ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండాలి

తప్పు చేస్తే చర్యలు తప్పవంటూ సిబ్బందికి ఎస్పీ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పోలీసులకు ఎస్పీ హర్షవర్ధనరాజు సూచించారు. గురువారం ఆయన తిరుపతిలోని ఎస్వీయూ స్టేషన్‌కు వెళ్లిన ఆయన రోజుకు ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? ఎన్ని ఎఫ్ఐఆర్‌లు చేస్తున్నారంటూ సీఐ రామయ్యను అడిగారు. ఎన్నికల కేసులపై ఆరా తీశారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ఆయన ట్రాఫిక్ పనితీరుపై డీఎస్పీ రామకృష్ణమాచ్చారితో మాట్లాడారు. సెంట్రల్ క్రైం స్టేషన్‌లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు తుప్పు పట్టి ఉండటం, కొన్నింటికి స్పేర్‌పార్టులు లేకపోవడం గమనించి సిబ్బందిని ప్రశ్నించారు. తిరుపతి వెస్ట్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన.. డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో కేసులు పరిష్కారం ఎలా వుందని సీఐ మురళీమోహన్‌ను అడిగారు. ఫిర్యాదుదారుల పట్ల కొందరు సిబ్బంది ప్రవర్తన మార్చుకోవాలని సూచించినట్లు తెలిసింది. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడి బెయిల్‌పై ఎవరైనా ఉంటే తక్షణం అదుపులోకి తీసుకుని విచారించాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి పరిష్కార చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఎదురుగా వచ్చే వాహనాలపై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ శ్రీలత, డీసీఆర్‌బీ సీఐ సుబ్రహ్మణ్యం, ఆయా స్టేషన్ల సీఐలు ఉన్నారు.

అమ్మవారి సేవలో హీరోయిన్ పూజా హెగ్డే



తిరుచానూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం సినీహీరోయిన్ పూజాహెగ్డే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శనే ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు కార్ల దగ్ధం




తిరుపతి రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ చెంచులక్ష్మి యానాది కాలనీలో సమీపంలోని ఏసీ మెకానిక్ షెడ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి నాలుగు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రయాదవ్ అనేవ్యక్తికి హైవే సమీపంలో ఏసీ కార్ సర్వీసింగ్ సెంటర్ ఉంది. ఈక్రమంలో గురువారం కొన్ని కార్లు షెడ్డుకు వచ్చాయి. రాత్రి పదిన్నర గంటల సమయంలో మెకానిక్ జయచంద్ర ఓ టెంపో వాహనాన్ని రిపేర్ చేస్తున్నాడు. తర్వాత పక్కన ఉన్న గదిలోని వెళ్లాడు. ఈసమయంలో అకస్మాత్తుగా టెంపో వాహనం నుంచి మంటలు వచ్చాయి. అవి వేగంగా వ్యాపించి పక్కనున్న వాహనాలకు అంటుకున్నాయి. విషయం తెలియడంతో ఫైర్ సిబ్బంది చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. అప్పటికే రెండు టెంపో వాహనాలు, రెండు కార్లు దగ్ధమయ్యాయని తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ చెప్పారు.











రేపు నమూనా పాలిసెట్ పరీక్ష

తిరుపతి(విద్య), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజన్న పార్క్ సమీపంలోని గగన కోచింగ్ సెంటర్‌లో శనివారం నమూనా పాలిసెట్ సెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కరుణామూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, అభ్యర్థులు ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన పనిలేదని పేర్కొన్నారు. పాలిసెట్ పరీక్ష విధానాన్ని అర్థం చేసుకుని సిద్ధమయ్యేందుకు ఈ పరీక్ష సాయపడుతుందని చెప్పారు. ఇతర సమాచారం కోసం 9014052757, 9553590099లలో సంప్రదించాలని కోరారు.





బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి


నిరసన తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌లో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వైఎస్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గురువారం విశ్రాంత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు రూపంలో దొడ్డిదారిన పెన్షనర్ల సవరణ బిల్లును ప్రవేశ పెట్టడం అన్యాయమన్నారు. ఈ బిల్లు అమలైతే దేశంలో 65 లక్షల మంది పింఛనుదారులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1972 తరహాలో పింఛనుసౌకర్యాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పింఛను పంపిణీలో పాత, కొత్త అని విభజన చేయరాదని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో నాయకులు రంగయ్య, గుర్రప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.

శారదమ్మకు ఘన నివాళి



తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ మాజీ చైర్మన్ పి.మునిరెడ్డి సతీమణి పి.శారదమ్మ శుభస్వీకరణ కార్యక్రమం కుమారుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్‌కుమార్‌రెడ్డి, జీవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మంగళం రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, బంధుమిత్రులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, తెలంగాణ వ్యవసాయ శాఖ మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత నిరంజన్‌రెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, టీడీపీ నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఎస్‌కే బాబు, అన్నా అనిత, నరసింహాచారి తదితరులు ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రమాణస్వీకారం



తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తిరుపతికి చెందిన పూరిమిట్ల కుమారి(కుమారమ్మ) గురువారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్ పెదపూడి విజయకుమార్ ఆధ్వర్యంలో డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రులు బాల వీరాంజనేయులు, నిమ్మల రామానాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. కుమారమ్మ మాట్లాడుతూ ఎస్సీలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.

పవన్‌కల్యాణ్‌కు శ్రీవారి ప్రసాదాలు



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మంగళగిరిలో గురువారం జనసేన పార్టీ తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి-డిబ్రూగాంల మధ్య నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు గురువారం పెనుప్రమాదం తప్పింది. కన్నియాకుమారిలో బుదవారం బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్ ఈరోడ్ స్టేషన్ చేరుకునే సమయానికి బి-6 ఏసి కోచ్‌కు ఎయిర్ సస్పెంక్షన్ స్ప్రింగ్ లీక్ కావడాన్ని ఉద్యోగులు గుర్తించారు. అక్కడ మరమ్మతులు చేయడానికి తగిన సామగ్రి లేని కారణంగా వేగాన్ని నియంత్రించి ఎస్కార్ట్‌తో పంపారు. ఈ కారణంగా రేణిగుంటకు గురువారం 12.10 గంటలకు రావాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంది. సుమారు 4.30 గంటలు ఆలస్యంగా వచ్చింది. ముందస్తు సమాచారంతో కోచ్ అండ్ వ్యాగన్ సాంకేతిక సిబ్బంది కోచ్ వద్దకు చేరుకుని మరమ్మతులు చేశారు. గంటకు 130 కిలోమీటర్లు లోపు ప్రయాణం చేసే విధంగా నిబంధనలు విధించి ఎస్కార్ట్‌తో పంపినట్లు అధికారులు తెలిపారు.

గంగజాతర ఏర్పాట్లు బాగా చేయాలి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాతయ్యగుంట గంగమ్మ జాతర ఏర్పాట్లను ఘనంగా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ విషయమై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు తాగునీరు అందించాలని, చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుధ్యం బాగుండాలని ఆదేశించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని మార్గాల్లో వీధి దీపాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.

ఘనంగా భారతీ తీర్థస్వామి వజ్రోత్సవ మహాసభలు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి శృంగేరి శంకర మఠంలో భారతీతీర్థ స్వామి 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వజ్రోత్సవ మహాసభలు గురువారం నిర్వహించారు. అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర శారదాంబ ఆలయంలో విశేష పూజలు, రాముల వారి ఉత్తరమాడ వీధులోని మఠంలో ఆది శంకరాచార్యుల అభిషేకం, పూజలు చేశారు. సాయంత్రం లలితా సహస్రనామ, విష్ణు సహస్రనామ, సౌందర్య లహరి పారాయణం జరిగింది. మఠం శాఖ ముఖ్య కార్యదర్శిగా గంద్రకోట లక్ష్మీ మనోహర్‌ను నియమించారు.

సమస్యలు పరిష్కరించకపోతే 7న మహాధర్నా

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈనెల 7వ తేదీన సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర స్పష్టం చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయ సమీపంలో కార్మికులు చేపట్టిన దీక్షలు గురువారంతో 11వ రోజుకు చేరుకున్నాయి. జయచంద్ర మాట్లాడుతూ దాదాపు రెండు వారాలుగా నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

బిడ్డల ఆకలి తీర్చడం గొప్ప వరం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): పురిటి బిడ్డలకు పాలిచ్చే అవకాశం లభించడం గొప్ప వరమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అన్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల నిధి మొదటి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.


10 నుంచి కలంకారి వర్క్‌షాపు

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు కలంకారి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ట్రైనర్ నెల్లూరు మునిలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం, శ్రీదివ్యాంగ్ సేవా కేంద్రం సహకారంతో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు 7702431281, 9398000686లను సంప్రదించాలని కోరారు.









ఆరడుగుల నాగు



తిరుమలలో టీటీడీ అధికారులు నివాసముండే బీటైప్ క్వార్టర్స్ వద్ద గురువారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. 60వ నెంబరు గదికి సమీపంలో పాము కనిపించడంతో భాస్కరనాయుడుకు సమాచారం ఇచ్చారు. వెంకటనే అక్కడికి చేరుకున్న ఆయన పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



భక్తుడికి తిరిగి బంగారు గొలుసు అందజేస్తున్న అధికారులు

మరచిపోయిన బంగారు గొలుసు తిరిగి అప్పగింత

కాటేజీ గదిలో మర్చిపోయిన బంగారు గొలుసును టీటీడీ అధికారులు భక్తులకు తిరిగి అప్పగించారు.నెల్లూరుకు చెందిన సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుమలకు వచ్చి సన్నిధానం అతిథిగృహంలో దిగారు. దర్శనం అనంతరం గురువారం గది ఖాళీ చేస సమయంలో 40 గ్రాముల బంగారు గొలుసును మర్చిపోయి వెళ్లిపోయారు. ఆతర్వాత గుర్తించిన సిబ్బంది దానిని అధికారులకు అందజేశారు. వివరాలు సేకరించిన అనంతరం సూపరిటెండెంట్ భాస్కర్‌నాయుడు, మేనేజర్ కామేశ్వరరావు, సబార్డినెంట్ చంద్రశేఖర్ విజిలెన్స్ ఆధ్వర్యంలో భక్తులకు గొలుసు అప్పగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఇబ్బంది పెట్టే నైజం నాది కాదు

● నమ్మకద్రోహం మానుకోండన్న ఎమ్మెల్యే ఆదిమూలం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'ఇబ్బంది పెట్టే నైజం నాది కాదు. అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం. కొంత మంది నాయకులు నమ్మకద్రోహం మానుకోవాలి'అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. తనను గత ఎన్నికల్లో ఓడించాలని కొంత మంది టీడీపీ నాయకులు ప్రత్యర్థి పార్టీతో చేతులు కలిపినా తాను వారిని విమర్శించలేదన్నారు. తాను వైసీపీ నాయకులకు పనులు చేయడం, మాట్లాడటం చేయలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.20కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి నాయకులను కాదని ఏ పనైనా తాను చేసుంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఊపిరి ఉన్నంత వరకు పార్టీకి విధేయుడిగానే ఉంటామన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ప్రజలు తనను నేరుగా కలిస్తే పనిచేయిస్తామన్నారు. ఎవరినో నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. పార్టీలో కష్టపడ్డవారికే నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు నందకిషోర్ రెడ్డి, జయశంకర్‌రెడ్డి, నిర్మల్, మురళి నాయుడు పాల్గొన్నారు.

సంగీత స్వరాల్లో వేదాలు

● అదే నా చివరి కోరిక



ఆలయం ముందు సంగీత దర్శకుడు కోటి


'స్వామి వైభవాన్ని తెలిపేలా అనేక అన్నమయ్య కీర్తనలు చేసిన నేను ఓ మహా యజ్ఞ కార్యక్రమానికి పూనుకున్నా. నాలుగు వేదాలను సంగీత రూపంలో తీసుకురావాలనుకుంటున్నాను. ఇదే నీ చివరి కోరిక కూడా' అని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇంతవరకు ఎవ్వరూ చేయని కార్యానికి తాను సంకల్పించానని చెప్పారు. ఇది ఎన్నేళ్లకు పూర్తవుతుందో కూడా తెలీదని, దేవుడు, అభిమానుల ఆశీస్సులతో పూర్తి అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావాలని కోరుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. ఇటీవల వాసవి కన్యాకపరమేశ్వరిపై 'వాసవి సాక్షాత్కారం' అనే ఆల్బమ్ చేయగా మంచి ఆదరణ లభించిందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు మంత్రి నాదెండ్ల పర్యటన

వడమాలపేట/తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని జేసీ శుభం బన్సల్ గురువారం తెలిపారు. వడమాలపేట మండలం తిరుమణ్యం రైతు సేవా కేంద్రం పరిధిలోని ఎనమలపాలెంలో ధాన్యం కోలుగోలు కేంద్రాన్ని మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించి, రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాన్ని ఆర్డీవో రామ్మోహన్, జిల్లా సివిల్ సప్లై అధికారి సుమతి, తహసీల్దార్ జరీనా, వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. సాయంత్రం 5గంటలకు తిరుపతి నగరం కెనడీ నగర్‌లో సిలిండర్ పంపిణీ చేసి తిరుమల వెళ్లనున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమలలో సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 12 గంటల పాటు వేచి ఉండక తప్పదు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,721

తలనీలాలు సమర్పించినవారు: 25,545

■ నేడు పదవ వార్షికోత్సవం

'దశ'దిశలా విద్యా సౌరభాలు



బోధన,పరిశోధనల్లో అగ్రపథాన తిరుపతి ఐఐటీ



కేంద్ర నిధులతో మౌలిక వసతులు



అంకిత భావంతో పనిచేసే సిబ్బంది, విద్యార్థుల పట్టుదల, ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చే పరిశ్రమల సహకారం ఐఐటీ అభివృద్ధి వెనుక ఉన్నాయి.. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా నిధులు ఇవ్వడంతో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమైంది. ప్రారంభం నుంచి మద్రాస్ ఐఐటీ మార్గదర్శకత్వం వహిస్తోంది. శుక్రవారం పదో వార్షికోత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ-తిరుపతి



తిరుపతి ఐఐటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ) పదేళ్లు పూర్తి చేసుకుంది. బాలారిష్టాలను అధిగమించి సగర్వంగా తలెత్తుకునే స్థితికి చేరింది. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల సరసన చోటు సంపాదించింది. ఏటా నిపుణులైన ఇంజనీర్లను అందిస్తూ సాంకేతిక ప్రగతిలో పాలుపంచుకుంటోంది. ఆరంభంలో తాత్కాలిక భవనాల్లో అవస్థలు పడినా నేడు విశాలమైన క్యాంపస్‌గా రూపుదిద్దుకుంది. ఎన్నో ఆవిష్కరణలు,పరిశోధనలతో అగ్రగామిగా దూసుకువెళ్తోంది. నేడు పదో వార్షికోత్సవ సందర్భంగా ఈ విద్యా సంస్థ ప్రస్థానాన్ని పరికిస్తే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర విభజనలో భాగంగా 2015 కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో ఐఐటీ ఏర్పాటు చేసింది. ఆరంభంలో చదలవాడ విద్యాసంస్థల ప్రాంగణంలోని తాత్కాలిక భవనంలో తరగతులను ప్రారంభించింది. నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ జాతీయ విద్యాసంస్థకు ఏర్పేడు మండలం మేర్లపాకలో 560 ఎకరాలను కేటాయించారు. దీనివిలువ సుమారు వెయ్యి కోట్లరూపాయలపైనే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వమే రూ.12 కోట్లతో భూమి చుట్టూ ప్రహరీని ప్రభుత్వం నిర్మించింది. ఐఐటీ సొంత గూటికి టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించింది. 106 మంది విద్యార్థులతో ఐఐటీ విద్యా ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. ఏడేళ్ల తర్వాత(2022 ఆగస్టు 1న) మేర్లపాక వద్ద సువిశాల ప్రాంగణంలోకి ఈ విద్యా సంస్థ అడుగుపెట్టింది. గడచిన పదేళ్లగా అధికారయంత్రాంగం,బోధనాసిబ్బంది అవిరళ కృషి ఫలితంగా అంచెలంచెలుగా విద్యాసంస్థ ముందంజ వేయగలిగింది. అత్యాధునిక ప్రయోగశాలలు, హాస్టల్ భవనాలు, తరగతి గదులు, క్రీడా సౌకర్యాలను సమకూర్చుకుంది. మద్రాస్ ఐఐటీ పర్యవేక్షణలో స్వయంప్రతిపత్తి హోదాతో ఇక్కడ బోధన, పరిశోధన నిర్విరామంగా సాగుతోంది. ఇప్పటివరకూ ఆరు బ్యాచుల్లో 2వేల మందికిపైగా ఐఐటీయన్లను జాతికి అందించింది.

ప్రధాన కోర్సులివే..

ఏటా బీటెక్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో 244 మంది విద్యార్థులకు ప్రవేశాలను పొందుతున్నారు. కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచులతోపాటు ఎంటెక్, ఎంఎస్(పరిశోధన ద్వారా), ఎమ్మెస్సీ, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ), పీహెచ్‌డీ సహా అనేక పీజీ ప్రోగాంలను తిరుపతి ఐఐటీ అందిస్తోంది. ప్రస్తుతం 1667 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు.

అకడమిక్ మైలురాళ్లు : ఇక్కడి ఐఐటీలో విభిన్న నైపుణ్యం కలిగిన 139 మందికి పైగా అధ్యాపకులున్నారు. దాదాపు 1266 ప్రచురణలకు సమర్పించారు. 203వరకు ప్రాయోజిత పరిశోధన ప్రాజెక్టులు, 209 ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీల ప్రాజెక్టులను చేపట్టారు. ఇప్పటివరకు 25 పేటెంట్లను దాఖలు చేశారు. పలు సంస్థల నుంచి ఎంవోయూలను చేసుకున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)- 2022లో మొదటి భాగస్వామ్యంలో ఈ ఐఐటీ ఇంజనీరింగ్ విభాగం 56వ ర్యాంకు పొందింది. ఇది అకడమిక్ ఎక్సలెన్స్‌లో సాధించిన విజయానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

రీసెర్చ్ క్యాంపస్

క్యాంపస్‌లో పదెకరాల విస్తీర్ణంలో విస్తరించిన రెండు సరస్సులు ఉన్నాయి. నీటి నిర్వహణ వ్యవస్థలో 600 కెఎల్డీ నీటి శుద్ధి విభాగం, రెండు మురుగునీటి శుద్ధి యూనిట్లు, రీసైకిల్ చేసిన నీటిని ఉపయోగించే మైక్రో ఇమేజింగ్ వ్యవస్థ ఏర్పాటయ్యాయి. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్, శీతలీకరణ వ్యవస్థ, అగ్నిమాపక భద్రతా వ్యవస్థలను సమకూర్చుకుంది. పచ్చదనం పరుచుకున్న ఇక్కడి వాతావరణం ఆహ్లాదం పంచుతుంది. 5,250 చెట్లు, 110,000 పూల మొక్కలు, 260 ఔషధ మొక్కలు, జీవవైవిధ్యతోటలు స్వాగతం పలుకుతాయి.

ఎంవోయూలతో ముందడుగు

సహకార పరిశోధన, విద్యాపరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి తిరుపతి ఐఐటీ దాదాపు 50 విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుచేసుకుని ముందడుగు వేస్తోంది. యూఎస్ఏ, నార్వే, కెనడా వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు ఇండియన్ నేవీ, ఎస్‌హెచ్ఏఐ, సీఎస్ఐఆర్ ఎస్ఈఆర్ఎల్, ఇండియన్ నావల్ అకాడమీ, హిందూస్తాన్ షిప్‌యార్డ్ సంస్థలో ఎంవోయూ చేసుకుంది. పీహెచ్‌డీ ప్రోగ్రాంపై నార్వే యూనివర్సిటీతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది.

విద్యార్థి విజయాలు

- రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ నిర్వహించిన గ్లోబల్ ఆన్‌లైన్ పోస్టర్ సదస్సులో సివిల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పీహెచ్‌డీ స్కాలర్ ఎంఎస్సీ నాగజ్యోతి రెండవస్థానంలో నిలిచారు.
- టూ మ్యూనిచ్‌లో పరిశోధనకు కెమికల్ ఇంజనీరింగ్ పీజీ విద్యార్థి ఆదిత్యన్ డాడ్ కేస్‌పీ స్కాలర్‌షిప్‌ను అందుకున్నారు.
- పరిశోధక విద్యార్థులు విరిత్, ప్రశాంత్ ఆర్‌డబ్లుటీహెచ్ వర్సిటీలో డాడ్ ద్విజాతీయ డాక్టోరల్ స్కాలర్‌షిప్‌లను పొందారు
- బీటెక్ విద్యార్థి చిరాగ్ కోటియన్ టొరొంటో వర్సిటీ మిటాక్స్ ఇంటర్న్‌షిప్‌ను పొందారు.



అధ్యాపకుల అవార్డులు

- అంతర్జాతీయ ఇంజనీరింగ్, ఆహార సంఘంచే ప్రొఫెసర్ కెఎస్ఎంఎస్ రాఘవరావు ప్రతిష్టాత్మకమైన లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.
- డాక్టర్ అజయ్‌కుమార్ చంద్రమీనన్ ప్రతిభ అవార్డు అందుకున్నారు
- ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ యూఎస్ఎన్ఏఈలో అంతర్జాతీయ సభ్యులుగా నియమితులయ్యారు.



శ్రీసిటీలో రష్యన్ ఫెడరల్ కాన్సుల్ జనరల్

● పెట్టుబడి అవకాశాలపై పరిశీలన

సత్యవేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. ఇండో రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తు చేశారు. మరిన్ని రష్యన్ పరిశ్రమలు శ్రీసిటీని ఎంచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీలోని మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూలత వాతావరణం, వేగవంతమైన అభివృద్ధి తదితర అంశాలపై కాన్సుల్ జనరల్ బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివశంకరన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. శ్రీసిటీకి ఉన్న బహుళ ప్రయోజనాల దృష్ట్యా, విభిన్న తయారీ రంగాలకు చెందిన మరిన్ని రష్యన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని వాలెరీ ఖోడ్జేవ్ తెలిపారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమను సందర్శించిన ఆయన.. అనంతరం సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ ఎండీ నిశ్చల్ పాధ్యాతో చర్చలు జరిపారు.



శ్రీసిటీ ప్రతినిధులతో కాన్సుల్ జనరల్ సమావేశం

వైభవంగా కోదండరాముడి రథోత్సవం



అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

● నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం 9.15 గంటలకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు రథాన్ని అధిష్ఠించి నాలుగు మాడవీధుల్లో విహరించారు. జైశ్రీరామ్ అని నినదిస్తూ భక్తులు రథాన్ని లాగారు. పలు సంఘాలు, భక్తులు మజ్జిగ, పానీయాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరుమంజనం, ఆస్థానం చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు ఊరేగారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

శుక్రవారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం నిర్వహిస్తారు.

నేటి నుంచి శ్రీరామనవమి ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్/శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం నుంచి 11వ తేది వరకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజూ ఉదయం 8గంటలకు విష్ణునివాసం, శ్రీనివాసం నుంచి హైటెక్ నాన్ ఏసీ బస్సు ఒంటిమిట్ట, దేవునికడప, తాళ్లపాక, నందలూరు మళ్లీ తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. రూ.700 ప్రయాణ చార్జీగా నిర్ణయించామని, మరిన్ని వివరాలకు 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సహ న్యాయవాదులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా సోమిశెట్టి ఉమాశంకర్ ఎన్నికయ్యారు. గురువారం గూడూరు కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా కే.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా షేక్ వహిదా, లైబ్రరీ సెక్రటరీగా యూసఫ్, స్పోర్ట్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా నవకోటి, సుమన్, ఏడుకొండలు, మహబూబ్‌బాషాతోపాటు మహిళా ప్రతినిధిగా ఎస్‌కే నాగూరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● సహాయకార్యదర్శి స్థానానికి జరిగిన ఎన్నికలో ఎం.శ్రీనివాసులు, అరవ పార్వతయ్యపై గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ఎండీ సర్దార్ ప్రకటించారు.

కక్ష పూరితంగా వక్ఫ్ చట్ట సవరణ: వైసీపీ



మాట్లాడుతున్న వైసీపీ మైనార్టీ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని సవరించడం ముస్లింలపై బీజేపీ కక్షపూరిత చర్యేనని వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ మగ్దూం విమర్శించారు. స్థానిక వైసీపీ మైనార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులను బీజేపీ సానుభూతి పరులకు కట్టబెట్టేం దుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ముస్లిం నాయకులు కాలేషా, జలీల్, అల్తాఫ్, మస్తాన్‌సాహెబ్, షఫీ, గౌస్‌బాషా, మస్తాన్‌బాషా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి స్తంభాల గిరీశ్వరుడి తిరునాళ్ల



ఆలయంలో తిరునాళ్ల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరునాళ్ల వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రయ్య నాయుడు, ఈవో శ్రీనివాసులు

డక్కిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన దేవునివెల్లంపల్లిలో స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. తిరునాళ్లకు సంబంధించిన పోస్టర్లను తిరునాళ్ల వ్యవహారాల ఇన్‌చార్జి మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్యనాయుడు, ఈవో శ్రీనివాసులు గురువారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్యనాయుడు మీడియాతో మాట్లాడుతూ ఈ తిరునాళ్లకు లక్షకుపైగా భక్తులు హాజరవుతారని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తిరునాళ్ల విజయవంతం చేస్తామన్నారు. రాపూరు, వెంకటగిరి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారని చెప్పారు. వేసవి కావడంతో భక్తుల కోసం పెద్ద ఎత్తున చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకొనేలా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు, అర్చకులు, డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

అనారోగ్య బాధితుడికి ప్రభుత్వం అండ

● రూ.7లక్షల మంజూరు ● చెక్కు అందించిన ఎమ్మెల్యే విజయశ్రీ



బాదితుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకుడు శ్రీనివాసులనాయుడు తదితరులు

సూళ్లూరు పేట, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడున్న వ్యక్తికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో ప్రభుత్వ సహాయ నిధి (ఎల్‌వోసీ) ద్వారా రూ.7 లక్షల మంజూరైంది. దొరవారిసత్రం మండలం కట్టువపల్లి గ్రామానికి చెందిన అందలమాల వెంకటాద్రి మెదడు సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ సహాయ నిధి ద్వారా మెదడు శస్త్రచికిత్సకు రూ.7 లక్షల మంజూరు చేశారు. ఈ మేరకు బాదితుడి కుటుంబ సభ్యులకు నగదు చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసుల నాయుడు తదితరులు ఉన్నారు.

షార్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సింజిత్ కుమార్, డీసీ నీలేష్ గౌర్, పక్కనే సంరక్షిత అధ్యక్షురాలు పల్లవి శర్మ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): షార్‌లోని సీఐఎస్ఎఫ్ యూనిట్ కార్యాలయం వద్ద గురువారం సీఐఎస్ఎఫ్ సంరక్షిక (సీఐఎస్ఎఫ్ భారత సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సంరక్షిక అధ్యక్షురాలు పల్లవి శర్మ, ఉపాధ్యక్షురాలు మీనా గౌర్ విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ నీలేష్ గౌర్ నేతృత్వంలో మాదకద్రవ్యాల వ్యసనంపై అవగాహన కల్పించారు. ముందుగా సీఐఎస్ఎఫ్, మెరైన్ సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

రైతులందరికీ ఒకే విధమైన పరిహారం ఇవ్వాలి

చిల్లకూరు, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ఒకే విధమైన పరిహారం ఇవ్వాలని క్రిస్ సిటీ భూ బాధితులు, తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరారు. గురువారం తమ్మినపట్నంలోని క్రిస్ సిటీ భూములను జేసీ శుభం భన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో లింగవరం గ్రామసమీపంలో రైతులు వారిని కలిశారు. డీకేటీ, సీజేఎఫ్ భూములకు సైతం సెటిల్‌మెంట్ భూములకు ఇచ్చినట్లే పరిహారం ఇవ్వాలని విన్నవించారు. వారితో పాటు తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నైపుణ్యం వెలికితీయండి



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ ఏవీ రమణ, ప్రణతి సంస్థ నిర్వహకులు సుంకర రవి

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉండే నైపుణ్యం వెలికితీసి వారికి నచ్చిన రంగాల్లో విజయం సాధించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సీఐ రమణ అన్నారు. గురువారం స్థానిక పింజలి వీరయ్య కల్యాణ మండపంలో ప్రణతి సంస్థ ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది శతక పద్యరత్న బాల పురస్కారాలు ప్రదానం చేశారు. శతక పద్యాలు ఆలపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీహరి, ఓంకార్, రోశయ్య, మల్లయ్య, రాజేష్, సుబ్బారావు, చాముండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో క్యాంపస్ సెలక్షన్స్



కంపెనీ ప్రతినిధులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రముఖ బల్క్ డ్రగ్ సంస్థ దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ వారిచే క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్‌కుమార్ తెలిపారు. మొత్తం 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు కే.రామ కృష్ణ, బి.తిరుపతయ్యలు విద్యార్థులకు మొదటి రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శివ కుమార్ తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పిరామ్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌స్పిరాన్-2025 సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 12 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా కళాశాలల విద్యార్థులు ప్రాజెక్టు ఎక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్, పోస్టల్ ప్రజెంటేషన్ పోటీల్లో పల్గొన్నారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

సంక్షేమం వైపు అడుగులు వేయాలి

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు ప్రతి రూపాయినీ దాచుకొని ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పేదరికాన్ని జయించాలని వెలుగు ఏపీఎం అనీలా కోరారు. వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, సంఘబంధ అధ్యక్షులతో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏపీఎం పొదుపు సంఘాల క్రెడిట్, లైవ్లీహుడ్‌లపై శిక్షణ ఇచ్చారు. 9 మంది వీవోఏలకు ఇన్యూమరేటర్ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీకాంత్, ప్రసాద్, శంకరయ్య, భాస్కర్, అలివేలమ్మ, బిందు ఉన్నారు.

పడిపోతున్న పుచ్చ ధరలు





కోట మండలం గూడలి వద్ద పుచ్చకాయలు కోస్తున్న కూలీలు, లారీకి లోడ్ చేస్తున్న కృష్ణ పుచ్చకాయలు

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లో ఈ ఏడాది పుచ్చసాగు విస్తారంగా పెరిగింది. రెండేళ్లుగా పుచ్చ దిగుబడులు లేక, ధరలు సరిగా లేక దెబ్బతిన్న రైతులంతా ఈ ఏడాది పుచ్చసాగును విస్తారంగా చేపట్టారు. అయితే ఈ ఏడాది పుచ్చ దిగుబడులు బాగా ఉన్నప్పటికి ధరలు పతనం అవుతుండటంతో పుచ్చరైతులు లబోదిబోమంటున్నారు. తీరప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఈ ఏడాది రైతులు ఫిల్టర్ పాయింట్‌లు, చెరువుల కింద పుచ్చ సాగు అధికంగా చేపట్టారు. కోట మండలంలో ఈ ఏడాది ఎక్కువగా గూడలి, రాజుపాళెం, దక్షిణ పొలం, కేశవరం, రాఘవాపురం, చిట్టేడు, రుద్రవరం, ఊనుగుంటపాళెంలతోపాటు పలు గ్రామాలలో విస్తారంగా పుచ్చసాగు చేపట్టారు. ప్రతి సంవత్సరం ఈ ప్రాంత రైతులు ఎక్కువగా నామ్‌దారి రకం పుచ్చను సాగుచేస్తూ ఉండేవారు. గత ఏడాది ఈ సాగులోనూ పెద్దగా దిగుబడులు రాకపోవడం, టన్ను రామ్‌దారి పుచ్చకాయలు రూ. 5వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే పలికాయి. నష్టాలతో దెబ్బతిన్న పుచ్చరైతులు ఈ ఏడాది కొత్తగా కృష్ణ అనే కొత్తరకం పుచ్చను సాగుచేశారు. ఈ రకం పుచ్చ ఉత్తరాదిలో ఎక్కువగా పండిస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడి రైతులు కృష్ణసాగును చేపట్టారు. దిగుబడులు కూడా బాగానే వచ్చాయి. దిగుబడులను దృష్టిలో ఉంచుకొని రైతులు ధరలపై ఆశలు పెంచుకున్నారు. అయితే ప్రస్తుతం కృష్ణ పుచ్చకాయలు టన్నుధర రూ.6వేల నుంచి రూ.7,200 వరకు పలుకుతుంది. ఇదే రకం పుచ్చకాయలు తమిళనాడు సరిహద్దు ప్రాంతాలలో టన్ను రూ..8వేలకు పైగా పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఢిల్లీ, ఆగ్రా, బెంగళూరు ప్రాంతాలలో పుచ్చకాయల ధరలు పడిపోయాయని అడిగేనాధుడే లేడని దళారులు ప్రచారం చేస్తూ ఇక్కడి రైతులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. బయట ప్రాంతాలకు స్థోమత ఉన్న రైతులు తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. సన్న, చిన్నకారు రైతులు మాత్రం దళారులు అడిగిన ధరలకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చదువుకున్న కళాశాల రుణం తీర్చుకుంటా



కంప్యూటర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న కళాశాల అభివృద్ధికి అన్నివేళలా సహకారం అందించి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎండబ్ల్యు కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేఆర్ కళాశాలకు వితరణగా అందజేసిన 10 కంప్యూటర్లను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ తాను ఇదే కళాశాలలో చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. ఈ కళాశాల నుంచే నాయకుడిగా ఎదిగానని కళాశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ఆ ప్రేరణతోనే కళాశాల అభివృద్ధికి అన్నివిధాలా తాను సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఇటీవల ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తద్వారా కళాశాలకు, కన్నతల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, రహీం, లీలావతి, బుజిగేంద్రరావు, శ్రీనివాసులురెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదిరులు పాల్గొన్నారు.

చెంబేడు మినీ రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయండి



మంత్రి నిమ్మల రామానాయుడును కలిసిన టీడీపీ నాయకులు

పెళ్లకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చెంబేడు చెరువు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ నాయకులు కోరారు. గురువారం అమరావతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలో నెలకొన్న సాగు, తాగునీటి వనరుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా నిర్మిస్తే దాదాపు 15 గ్రామాలకు పైగా సాగు, తాగునీటి సమస్య తీరుతుందన్నారు. గతంలో వచ్చిన వరదలకు చెరువులు, చెరువులకు సాగు నీరందించే కాలువలతో పాటు గేట్లు దెబ్బతినగా గత వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి రామానాయుడు నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్‌మోహన్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్యానాయుడు, కృష్ణమనాయుడు, మురళీనాయుడు తదితరులు ఉన్నారు.

గర్భకండ్రిగ భూములకు మోక్షం కలిగిస్తాం



గర్భకండ్రిగ భూముల రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 20 యేళ్లుగా పరిష్కారానికి నోచుకోని గర్భకండ్రిగ భూములకు (చేతుల వృత్తుల వారికి వెంకటగిరి సంస్థానం వారు ఇచ్చిన ఇనాం భూములు) పది రోజుల్లో మోక్షం కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు తెలిపారు. కోట మండలం వెంకన్నపాళెంలోని గర్భకండ్రిగ భూములను గురువారం వారు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఉన్న 346.77 ఎకరాల రైతుల భూములు గర్భకండ్రిగ జాబితాలో ఉన్నాయి. 20 ఏళ్ల నుంచి ఈ భూములను అమ్ముకోలేక కొనుగోలు చేయలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వెంకన్నపాళెం రైతులు అధికారుల ఎదుట వాపోయారు. స్పందించిన జేసీ, సబ్ కలెక్టర్లు అక్కడ ఉన్న భూములను స్వయంగా పరిశీలించి తక్షణం నివేదికలు తయారుచేయాలని తహసీల్దారు జయజయరావును, మండల సర్వేయర్ ను ఆదేశించారు. పది రోజుల్లో రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపుతామని జేసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాళెం సర్పంచ్ కొకర్ల మధుయాదవ్, స్థానిక రైతులు ఉన్నారు.

పుత్తూరు వార్తలు

కలెక్టర్, ఎమ్మెల్యేకి వినతుల వెల్లువ



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు వినతులు అందజేస్తున్న బాధితులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌లకు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు సమీక్షించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు వడ్డీలు చెల్లించి ముందస్తుగా నగదు చెల్లించి ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. దళితవాడల్లో శ్మశాన వాటికలు లేవన్నారు. బీసీ, ఎస్సీ హాస్టళ్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వాస్పత్రికి 100 పడకలు మంజూరు చేయాలని తదితర సమస్యలను కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య ఆధ్వర్యంలో కట్ట కింద రామకృష్ణాపురం ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటికకు దారి కల్పించాలంటూ డిమాండ్ చేశారు. తాయిమాంబాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈశలాపురం రెవెన్యూ పరిధిలోని క్వారీలో పేలుడు కారణంగా ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని, అనుమతులు లేకుండా పేలుళ్లు చేపడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఆర్డీవో రామ్మోహన్‌ను విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పలువురు వివిధ అంశాలపై వినతులు అందజేశారు. పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్, ఎమ్మెల్యే భానుప్రకాష్ హామీ ఇచ్చారు.

వైభవంగా జీవ ధ్వజస్తంభ మహా శాంతి అభిషేకం



ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వడమాలపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జీవ ధ్వజస్తంభ మహా శాంతి అభిషేకం వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం పునర్నిర్మాణంలో భాగంగా నిర్వహిస్తున్న సంప్రోక్షణ కార్యక్రమంలో గురువారం శాంతి అభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలుపు, అర్చన నిర్వహించారు. అనంతరం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను యాగశాలకు వేంచేపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు ఆధ్వర్యంలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య నూతనంగా నిర్మించిన ధ్వజస్తంభం వద్ద వేదపారాయణం చేస్తూ జీవ ధ్వజస్తంభం మహా శాంతి అభిషేకం నిర్వహించారు. తరుపతి పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదిరతులు పాల్గొన్నారు.

పుత్తూరులో 20కి పైగా చికున్ గున్యా కేసులా?

● కలెక్టర్ తీవ్ర అసహనం, పారిశుధ్య లోపంపై అసంతృప్తి

● ఎమ్మెల్యేతో కలిసి జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా లేనివిధంగా పుత్తూరులో 20కి పైగా చికున్ గున్యా కేసులు నమోదు కావడంపై కలెక్టర్ వెంకటేశ్వర్ అసహనం వ్యక్తం చేశారు. డెంగ్యూ కేసులూ నమోదవడంతో మున్సిపాలిటీ, ప్రజారోగ్య విభాగం పనితీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని ప్రాంతాల్లో నీటిని పరీక్షించాలని, డెంగ్యూ నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పుత్తూరు పట్టణం, మండలం, వడమాలపేట మండల పరిధిలో అభివృద్ధి పనులపై గురువారం పుత్తూరులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి నియంత్రణకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్ల ద్వారా సరిపడా నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెప్పగా.. అత్యవసరంగా నీటి ఎద్దడి ఏర్పడితే ఏం చేస్తారన్న కలెక్టర్ ప్రశ్నకు ఎవరి నుంచీ సమాధానం లేదు. పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కార్మికుల మస్టర్, పనితీరును తెలుసుకున్న ఆయన.. విధులకు హాజరుకాని వారి విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు.వరి పంట ఎన్ని ఎకరాల్లో వేశారన్న ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానం రాలేదు. సంక్షేమాధికారిణి సమీక్షకు హాజరుకాకపోవడం పట్ల షోకాజ్ నోటీసు జారీకి ఆదేశించారు.

నీటి సరఫరాకు చర్యలు చేపట్టండి

జిల్లాతో పోలిస్తే వడమాలపేట, పుత్తూరుల్లో నీటి సమస్య ఉందని, ప్రతి హ్యాబిటేషన్, ప్రతి ఇంటికి 55 ఎల్‌పీసీ నీరు అందించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. గత రీసర్వేలో దొర్లిన తప్పులను సరిచేసి పక్కాగా రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే దిశగా నూతనంగా ప్రవేశపెట్టిన క్లస్టర్ విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఎంఈవోలను ఆదేశించారు. ధాన్యం సేకరణ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా మామిడితో పాటు డ్రాగెన్ ఫ్రూట్, పామాయిల్, ఇతర పంటలను వేసేందుకు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

మట్టిరోడ్లు ఉండరాదు

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ.. నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు ఉండకూడదని, పెండింగ్ రోడ్ల సమస్యతో ప్రజలు ఇబ్బంది పడరాదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇళ్లు లేని నిరుపేదలకు అర్బన్ పరిధిలో 2 సెంట్లు, రూరల్ పరిధిలో 3 సెంట్లు స్థలం కేటాయింపునకు స్థలం గుర్తించాలన్నారు. అర్హులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో సుశీలదేవి, తిరుపతి డివిజన్ ఆర్డీవో రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, ఎంపీడీవోలు రమేష్‌బాబు, శేషగిరిరావు, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు, తహసీల్దారులు వెంకటేశ్వర్లు, జరీనా తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీలో సుమారు రూ.10లక్షలతో, పెద్దపాండూరు పంచాయతీ వెంకటేశ్వర ఎస్టీకాలనీలో రూ.9లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులకు సౌకర్యంగా ఉండేందుకు ఈ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. వెంకటేశ్వర ఎస్టీకాలనీలో ఇటీవల ప్రమాదంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రమణయ్య భార్య రజని, పిల్లలను పరామర్శించారు. కాంబాకం పంచాయతీలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును కూడా ప్రారంభించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇందిరానగర్ పంచాయతీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రమేష్, టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు నందకిషోర్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, నిర్మల, మురళి నాయుడు, నాగార్జున, జనసేన నాయకులు చిరంజీవియాదవ్, తులసి, పృథ్వీ, పరశురామ్, ఎంపీడీవో ప్రసాద్, ఈవోపీఆర్డీ చిరంజీవి, సర్పంచులు కవిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల అందజేత

వరదయ్యపాళెంలో ఈక్రాప్ నమోదు చేసుకున్న ఏడుగురు రైతులకు రోటావేటర్, పవర్ స్ప్రేయర్, మడకలు, పవర్‌బిడ్ తదితర పరికరాలను ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. ఏడీ సుబ్రహ్మణ్యం, ఏవో గౌరిదేవి, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నందకిషోర్‌రెడ్డి, నిర్మల్, జయశంకర్‌రెడ్డి, రైతులు కృష్ణయ్య, రమేష్‌రెడ్డి, రమేష్ ప్రవీణ్, మునిరాజా, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సవరణ బిల్లును రద్దు చేయాలి


అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న రైల్వే విశ్రాంత ఉద్యోగులు

రేణిగుంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన ఉద్యోగుల సవరణ బిల్లును రద్దు చేయాలని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేడ్కర్, కస్తూర్బా, మహాత్మా గాంధీ విగ్రహాల ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ 8వ సీపీసీ కింద పెన్షనర్లందరికీ సమాన ప్రయోజనాలు అందే విధంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇవ్వాలని, పదవీ విరమణ తేదీల ఆధారంగా పెన్షనర్ల మధ్య భేదం చూపకుండా ఒకే విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ చైర్మన్ హసన్ సాహెబ్, రైల్వే విశ్రాంత ఉద్యోగి సర్పంచ్ నగేష్, బ్రాంచ్ కార్యదర్శి జయంత్ కుమార్, ఆఫీస్ బేరర్లు రాజేంద్ర ప్రసాద్, అప్పారెడ్డి, రాజేంద్రన్, రవీంద్రబాబు, షణ్ముగం తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవినాయక్ (ఇన్‌సెట్‌లో) బత్తిరెడ్డి మృతదేహం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో చిన్నబత్తిరెడ్డి(67) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు పేట గ్రామంలో వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసుల కథనం మేరకు... తొండమనాడుపేట గ్రామానికి చెందిన చిన్నబత్తిరెడ్డి అలియాస్ జిజ్జేలురెడ్డి చిన్నకారు రైతు. ఈయనకు గ్రామంలోని కొందరు దాయాదులతో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఇటీవల ఆస్తి పంపకాల విషయమై విభేదాలు ముదిరాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరిగా వేలాడుతూ మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మొహానికి టవల్ చుట్టుకుని దానిపై ఉరి వేలాడటంపై పోలీసులకు అనుమానం కలిగింది. మృతుడి భార్య భూలక్ష్మి ఇటీవల జరిగిన ఆస్తి గొడవలపై పోలీసులకు వివరించారు. బుధవారం సాయంత్రం వరకు ఇంటి వద్ద గడ్డివాము పనులుకూడా ఒక్కడే నిర్వహించినట్లు వివరించారు. ఎవరైనా చంపి ఉరిగా వేలాడదీసి ఉంటారనే కోణంలో భార్య భూలక్ష్మి అనుమానంగా పేర్కొంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు


ఆధార్ సేవలు తీస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపుకు స్పందన లభించింది. చాలా కాలంగా ఆధార్ కేంద్రం తెరవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు దృష్టికి సమస్యను తీసుకుపోవడంతో కార్యదర్శి సుబ్రమణ్యం ఎట్టకేలకు ఆధార్ క్యాంపు నిర్వహించారు. చిన్న పిల్లల ఆధార్‌తో పాటు ఇతర సేవలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా ఆధార్ క్యాంపు కొనసాగుతుందని కార్యదర్శి తెలిపారు.

పేదలకు అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, సురేష్, లక్ష్మణ్, వెంకటరమణయాదవ్, చందుయాదవ్, మునిచంద్ర, ప్రదీప్‌కుమార్, దినేష్, ప్రభాకర్, మునికుమార్, సాయి, మహేష్, చందు, వీర మహిళలు లక్ష్మి, రాజ్యలక్ష్మి, శారద, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా
గురు దక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక కత్యువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో వ్యభిచారం సాగుతుండటంతో పోలీసులు దాడి చేసి కేసులు నమోదు చేశారు. పట్టణంలోని తేరువీధిలో ఉన్న ఓ ప్రైవేటు లాడ్జితో పాటు అక్కడికి సమీప ప్రాంతంలోని మరికొన్ని లాడ్జీల్లో కూడా వ్యభిచారం సాగుతున్నట్లు గురువారం శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ సీఐ గోపి సిబ్బందితో మొదట తేరువీధిలోని లాడ్జీలో సోదాలు నిర్వహించారు. అక్కడ ముగ్గురు మహిళలతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే లాడ్జీ లీజు ఓనర్‌తో పాటు విధుల్లో ఉన్న మేనేజరును కూడా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదే తరహాలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన మరో రెండు లాడ్జీలను కూడా తనిఖీ చేశారు. అక్కడ ఎలాంటి వ్యభిచార నిర్వహణ పట్టుబడలేదని సీఐ గోపి వెల్లడించారు. తేరువీధి లాడ్జీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం

సత్యవేడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకు ఈ నెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు మొదలు కానున్నాయని సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో అన్ని వసతులతో కూడిన అధునాతన లేబొరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎంసెట్ కోచింగ్ తదితర సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ఎంబైపీసీ గ్రూపు కూడా ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు తమ కళాశాలలో చేరవలసినదిగా కోరారు. కాగా ఈనెల 1వ తేదీ నుంచి సెకండ్ ఇయర్ తరగతులు కూడా ప్రారంభమయ్యాయని, ఈనెల 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించి వేసవి సెలవులు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. తిరిగి జూన్ 2న తిరిగి తరగతులు పునః ప్రారంభమవుతాయని వెల్లడించారు.

మద్యం తాగి
వాహనం నడిపిన వారికి జరిమానా

రేణిగుంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి, హైవేలో రాంగ్ రూటు డ్రైవింగ్ చేసిన 22 మందిపై గురువారం పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా వారికి రూ.47,500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

హిందూమతంపై రెచ్చగొట్టే పోస్టింగులు చేస్తే సహించేది లేదు

రేణిగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హిందూ మతంపై రెచ్చగొట్టే పోస్టింగులు చేస్తే సహించేది లేదని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ సభ్యురాలు తేజోవతి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల రేణిగుంట మండలంలో ఫేస్బుక్, వాట్సాప్ గ్రూపులో వైసీపీకి చెందిన ఓ వర్గం వారు పనిగట్టుకొని టీటీడీ పాలక మండలిలో ముస్లింలకు బోర్డు సభ్యులుగా స్థానం కల్పించాలని పోస్టులు చేయడంతో ఇది కాస్త సోషల్ మీడియా వైరల్‌గా మారిందని చెప్పారు. వెంటనే ఈ విషయంపై పోలీసులు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా శ్రీదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం పదవీ విరమణ చేయడంతో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న శ్రీదేవి బీఎన్‌కండ్రిగలో బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది తహసీల్దార్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.

స్కూల్‌వ్యాన్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు


గాయపడిన సరోజమ్మ

కేవీబీపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె గ్రామానికి చెందిన సరోజమ్మ(70) అనే వృద్ధురాలిని స్కూల్‌వ్యాన్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ నరేష్ కథనం మేరకు... గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన తమ కుమార్తెను బస్సు ఎక్కించి ఇంటికి తిరిగి వెళుతున్న సరోజమ్మను పిచ్చాటూరు మండలంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన వ్యాన్ విద్యార్థులను తీసుకెళుతూ వెనుక నుంచి ఆమెను ఢీకొంది. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. స్థానికులు గుర్తించి ఆమెను ప్రైవేటు వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. వ్యానును స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు
తప్పిన పెను ప్రమాదం

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి-డిబ్రూగాంల మధ్య నడుస్తున్న వివేక్‌ఎక్స్‌ప్రెస్‌కు గురువారం పెను ప్రమాదం తప్పింది. కన్నియాకుమారిలో బుధవారం బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్ ఈరోడ్ స్టేషన్ చేరుకునే సమయానికి బి-6 ఏసి కోచ్‌కు ఎయిర్ సస్పెన్షన్ స్ప్రింగ్ లీక్ కావడాన్ని ఉద్యోగులు గుర్తించారు. అక్కడ మరమ్మతులు చేయడానికి తగిన సామగ్రి లేని కారణంగా వేగాన్ని నియంత్రించి ఎస్కార్ట్‌తో పంపారు. దీంతో రేణిగుంటకు గురువారం 12.10 గంటలకు రావాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంది. సుమారు 4.30 గంటలు ఆలస్యంగా వచ్చింది. ముందస్తు సమాచారంతో కోచ్ అండ్ వ్యాగన్ సాంకేతిక సిబ్బంది కోచ్ వద్దకు చేరుకుని మరమ్మతులు చేశారు. గంటకు 130 కిలోమీటర్లు లోపు ప్రయాణం చేసే విధంగా నిబంధనలు విధించి ఎస్కార్ట్‌తో పంపినట్లు అధికారులు తెలిపారు.

చిచ్చురేపిన ఉపాధిహామీ

- టీఎంవీకండ్రిగ, చుక్కల నిడిగల్లు గ్రామాల మధ్య ముదిరిన వివాదం
- రాకపోకలను అడ్డుకునేందుకు రోడ్డును తవ్వేసిన వైనం


టీఎంవీ కండ్రిగ వద్ద రోడ్డును తవ్వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు రెండు గ్రామాల మధ్య చిచ్చు రేపింది. ఇద్దరి మధ్య వాగ్వాదం ముదిరి ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. రెండు గ్రామాల మధ్య రాకపోకలు జరగకూడదంటూ ఆగ్రహావేశాలతో రోడ్డును తవ్వేసే పరిస్థితి నెలకొంది. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగ వద్ద గురువారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలంలో టీఎంవీకండ్రిగ, ఆ గ్రామానికి పొరుగున చుక్కల నిడిగల్లు ఉంది. ఈ రెండు గ్రామాల మధ్య చెరువు సరిహద్దుగా ఉంది. చెరువుకు ఎగువ భాగాన ఉన్న భూమిలో ఎలాంటి సాగు చేపట్టకూడదని పదేళ్ల క్రితం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. చెరువు బ్యాక్‌వాటర్ నిలిచే భూములపై దశాబ్ద కాలంగా వివాదం కొనసాగుతోంది. ఆ భూమిలో గురువారం చుక్కలనిడిగల్లు గ్రామస్థులు ఉపాధిహామీ పథకం కింద గుంతలు తీసే పనులు చేపట్టారు. సరిహద్దు వివాదం ఉన్న తరుణంలో చెరువు వద్ద ఒక గ్రామానికే ఉపాధిహామీ పనులు ఎలా కేటాయిస్తారంటూ టీఎంవీకండ్రిగ గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం ముదిరి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ గ్రామాల మధ్య రాకపోకలు జరగకూడదంటూ కొందరు రోడ్డును తవ్వేశారు. ఈ సమాచారం తెలుసుకున్న శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఇరు గ్రామాల వారు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమస్యను విన్నవించారు. ఈ నెల 15వ తేదీన అధికారుల బృందంతో అక్కడ పర్యటించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే భరోసా ఇవ్వడంతో ఇరు గ్రామాల ప్రజలు శాంతించారు.


విజయవాడలో ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును గురువారం కలిసి సన్మానిస్తున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత - నాగబాబుతో జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, గరికపాటి చంద్ర తదితరులు

ఎమ్మెల్యే ఆదిమూలంపై
కుట్ర రాజకీయాలు మానుకోండి

పిచ్చాటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదిమూలంపై తమ పార్టీకి చెందిన కొందరు (చెరకు బ్యాచ్) చేస్తున్న కుట్ర రాజకీయాలను మానుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి కోరారు. గురువారం పిచ్చాటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలం వైసీపీ నాయకులకు వర్కులు ఇస్తున్నారని, తెలుగుదేశం పార్టీ క్యాడర్‌ను పట్టించుకోవడం లేదని బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసయాదవ్‌కు (చెరకు బ్యాచ్) చేసిన ఫిర్యాదును తీవ్రంగా ఖండించారు. తాము ఓడించాలనుకున్న ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలవడం జీర్ణించుకోలేక చెరకు బ్యాచ్ ఎమ్మెల్యేని కాదని పార్టీ ఇన్‌చార్జి నియమించుకోవాలని కుట్ర రాజకీయాలకు తెర లేపారని మండి పడ్డారు. ఫిర్యాదు చేసిన చెరకు బ్యాచ్ సైతం టెండర్ వర్కులు పొంది పనులు చేసిన సంగతి నిజం కాదా అని ఆయన సవాల్ విసిరారు. నిజా నిజాలు పరిశీలించి, ఈ చెరకు బ్యాచ్‌పై అధిష్ఠానం వెంటనే చర్యలు తీసుకోవాలని ఇళంగోవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సుమాంజలి, వెంకటరత్నం నాయుడు, ఆయకట్టు చైర్మన్ పద్మరాజు, రవిరెడ్డి, వాసురెడ్డి, భక్తారెడ్డి, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

'పొజిషన్'కు లంచాలు ఇవ్వలేం



నిరసన తెలుపుతున్న ప్రజలు, సీపీఐ నాయకులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పొజిషన్ సర్టిఫికెట్‌కు లంచాలు ఇచ్చుకోలేమని వెంగారెడ్డి కండ్రిగ గ్రామ ప్రజలు అంటున్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఐ నాయకుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ వెంగారెడ్డి కండ్రిగలో సుమారు వంద కుటుంబాల వారు ఇల్లు నిర్మించుకోవడానికి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఇంటి కోసం స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ కావాలని అడిగితే సంబంధిత ఉద్యోగులు రూ.10వేలు నుంచి రూ.15వేలు వరకు డిమాండ్ చేస్తున్నారన్నారు. తహసీల్దారుకు ప్రజలు మొరపెట్టుకోవాలనుకుంటే ఆయన కార్యాలయం ఎపుడూ మూసే ఉంటుందని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు మురళి, ప్రజలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం


విశ్రాంత ఉద్యోగులకు చిత్రపటాలు అందజేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు గురువారం దేవుడి చిత్రపటాలను బహూకరించారు. పెన్షనర్స్‌డేను పురస్కరించుకుని పదవీ విరమణ పొంది 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శ్రీవారి సురేష్, ముని, వేలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని 'ఉపాధి' సిబ్బంది


సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు - ఖాళీగా ఉన్న ఏపీఎం కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉపాధి హామి పథకం కార్యాలయంలో సమయపాలన పాటించకపోవడంతో గురువారం కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కార్యాలయంలో ఏడుగురు విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ముఖ్య అధికారులైన ఏపీఎం, ఈసీలతో పాటు పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు విధులకు హాజరు కాలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు సిబ్బంది లేక ఎదురు చూసి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నామంటూ భరోసా


ఆర్థిక సాయం చేస్తున్న యువతరం సేవాసమితి సభ్యులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మేమున్నామంటూ ఓ కుటుంబానికి యువతరం సేవాసమితి సభ్యులు భరోసా ఇచ్చారు. యువతరం సేవాసమితిలో స్వచ్ఛంద సేవకుడిగా ఉన్న పోలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తమ సంస్థ సభ్యుడు మరణించడంతో యువతరం సేవాసమితి స్పందించి దాతల నుంచి సాయం కోరారు. సుమారు రూ.లక్ష సేకరించారు. ఆ సొమ్మును గురువారం పోలయ్య భార్యకు యువతరం సేవా సమితి సభ్యులు అందజేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ తమ సభ్యుడు మరణించడం కలచివేసిందన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా, దాతలు సాయం చేయడం సంతోషకరమన్నారు. వారికి తమ సంస్థ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కాగా హైదరాబాద్‌కు చెందిన అభయం ఫౌండేషన్ సహకారంతో ఈ నెల 10న ఆ కుటుంబానికి జీవనాధారం కోసం కుట్టుమిషన్ అందజేస్తామని తెలిపారు.

చక్రస్నానంతో ముగిసిన ఉత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాలమంగళం ఉత్తరంలో వెలసిన భద్రావతి సమేత భావనారుషిస్వామి ఉత్సవాలు చక్రస్నానంతో ముగిశాయి. గురువారం అరుణానదిలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చక్రస్నాన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి


నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

సత్యవేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డిపోలలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) సత్యవేడు డిపో సెక్రటరీ వి.బాబు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం డిపో ఎదుట ఆ సంఘం నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, టికెట్టు తీసుకునే బాధ్యత ప్రయాణికుడిదే అనే చట్టాన్ని అమలు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, డిపో అధ్యక్షుడు పార్థసారథి, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.శేఖర్, కుప్పయ్య, సీసీఎస్ డెలిగేట్ జి.సురేష్, కేసీఆర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రం వద్ద పద్మావతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైకాలవీధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పోషకాహార బాలసంజీవిని కిట్లను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారనే దానిపై రికార్డులను పరిశీలించారు. పిల్లలు చెప్పే కథలు, పాటలు, ఆటలను చూసి ఆనందించారు. బాలింతలు, గర్భిణులను ఆరా తీయగా తమకు అన్ని అందుతునాయని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

పిచ్చాటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మహ్మద్‌రఫీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 0 నుంచి 6 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ఉచితంగా ఆధార్ కార్యక్రమం జరుగుతుందని, ఒక వేళ బర్త్ సర్టిఫికెట్‌లేని ఎడల తహసీల్దార్ కార్యాలయం ద్వారా, ఆపై బడిన పిల్లలకు ఆర్డీవో ద్వారా నుంచి బర్త్ సర్టిఫికెట్ ఇప్పిస్తారని తెలిపారు. శుక్రవారం కీళపూడి సచివాలయంలో, 8వ తేదీ పిచ్చాటూరు సచివాలయంలో, 9న రామాపురం, 10న ఎంపీపీ ఎలిమిటరీ స్కూలు అడవి కండ్రిగ, టీకేపురం ఎంపీపీ ఎలిమెంటరీ స్కూలుతో పాటు బంగాళా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

ప్రముఖులను కమ్మేస్తున్న సిబ్బంది


సినీ నటి పూజాహెగ్డేని చుట్టుముట్టిన ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే కొందరు సిబ్బంది అత్యుత్సాహంతో కొందరు ప్రముఖులను కమ్మేస్తున్నారు. వారికి చిరాకు తెప్పిస్తున్నారు. విధులు నిర్వర్తించాల్సిన పాయింట్లను వదలి సెల్ఫీల కోసం వెంటపడుతున్నారు. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలా గురువారం సినీ నటి పూజాహెగ్డే దర్శనానంతరం కంచుగడప వద్దకు రాగా.. ఆలయ సిబ్బంది చుట్టుముట్టడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.